ఎయిర్‌పోర్టు కోసం భూముల సర్వే

సంగెం: గుంటూరుపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

సంగెం/కరీమాబాద్, మార్చి 6: మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం గుంటూరుపల్లిలో అధికారులు గురువారం సర్వే ప్రారంభించారు. రెండు రోజుల క్రితం సర్వే నిలిపివేయాలని కోరుతూ గుంటూరుపల్లి, నక్కలపల్లి, గాడెపల్లి రైతులు ధర్నా చేశారు. మరుసటి రోజు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హైదరాబాద్‌కు వెళ్లి బుధవారం తిరిగి వచ్చి గుంటూరుపల్లి రైతులతో మాట్లాడారు. సర్వేకు సహకరిస్తే సీఎంతో మాట్లాడి పరిహారం విషయంలో తగిన న్యాయం చేస్తానని చెప్పినట్లు పలువురు రైతులు చెబుతున్నారు. ఈ సందర్భంగా గుంటూరుపల్లికి చెందిన రైతులు కొనకంచి శ్రీకాంత్, కొత్తపల్లి నారాయణ మాట్లాడుతూ తమ గ్రామానికి తప్పనిసరిగా రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. వరంగల్‌కు వెళ్లాలంటే మూడు కిలో మీటర్లు వెనక్కి కాపుకనపర్తికి వెళ్లి, అక్కడి నుంచి గాడెపల్లి మీదుగా వరంగల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నారు. తమకు న్యాయం చేస్తే విమానశ్రయానికి సహకరిస్తామని తెలిపారు. అలాగే, వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఖిలావరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు స్థలాలను పరిశీలించారు. డీసీపీ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని, సర్వేకు సహకరించాలని ప్రజాప్రతినిధులు రైతులను కోరినట్లు తెలుస్తోంది.

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్, మార్చి 6: కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పనులను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫౌంటెన్ పనులపై అధికారులకు సూచనలు చేశారు. భద్రకాళీ చెరువులో కుడా ఆధ్వర్యంలో మూడు లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 50 వేల క్యూబిక్ మీటర్ల పూడికతీత పనులు పూర్తి చేశామన్నారు. అనంతరం ఖిలావరంగల్‌లోని ఏకశిలా పిల్లల పార్కును సందర్శించి మెరుగైన వసతులు కల్పించాలన్నారు. కిచెన్, డైనింగ్ హాల్, ఓపెన్ థియేటర్, కాటేజీలు, టాయ్‌లెట్లు నిర్మించాలన్నారు. బండ్ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు చేయాలన్నారు. కార్యక్రమంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు పాల్గొన్నారు.

పెట్రోలింగ్‌తో నేరాలను నియంత్రించాలి: సీపీ

సమావేశంలో మాట్లాడుతున్న అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, మార్చి 6: రాత్రి వేళల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించి నేరాలను నియంత్రించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో గురువారం ఆయన పెట్రోకార్, ఇంటర్‌సెప్టార్ కార్, హైవేలపై పెట్రోలింగ్ విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బందితో సమీక్షించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా నిరంతరం పెట్రోలింగ్ చేయాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో నిరంతరం నిఘా పెట్టాలన్నారు. సమీక్షలో అదనపు డీసీపీ రవి, పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన డ్రైవర్ నిర్లక్ష్యం

- 37 మంది కూలీలతో వెళ్తున్న ఆటో ట్రాలీ
- అదుపు తప్పి బోల్తా పడిన వాహనం
- స్పాట్‌లో ఒకరు డెత్.. పలువురికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం.. ఎంజీఎం దవాఖానకు తరలింపు

చెన్నారావుపేట: ఘటనా స్థలంలో రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

చెన్నారావుపేట, మార్చి 6: డ్రైవర్ నిర్లక్ష్యం వ్యవసాయ కూలీల ఇంట విషాదం నింపింది. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఆటో ట్రాలీ బోల్తా పడడంతో ఒకరి మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కోనాపురం గ్రామ శివారులో గురువారం ఉదయం జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జీడిగడ్డతండాకు చెందిన సుమారు 37 మంది వ్యవసాయ కూలీలు వారం రోజులుగా నర్సంపేట మండలం ఇటుకాలపల్లి పరిసర గ్రామాల్లోని మిరప తోటల్లో మిర్చి ఏరేందుకు వెళ్తున్నారు. రోజు వారీగా గురువారం ఇప్పల్‌తండాకు చెందిన ధరావత్ మైబు తన ఆటో ట్రాలీలో సుమారు 37 మంది కూలీలను తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాలీ వాహనం కోనాపురం గ్రామ శివారులోకి చేరుకోగానే అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ఉన్న బానోత్ సుక్యా(55) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆంగోత్ గామ, బానోత్ ఈర్య, భూక్యా గమ్లీ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చాలా మంది కూలీల చేతులు, కాళ్లు విరిగాయి. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో క్షతగాత్రుల ఆర్తనాదాలు, రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో నర్సంపేట ఏరియా దవాఖానకు తరలించారు. అయితే, డ్రైవర్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుడు సుక్యా కుమారుడు ఫిర్యాదు చేశాడు. ఒకే గ్రామానికి చెందిన కూలీలు రోడ్డు ప్రమాదంలో గాయాలపాలు కావడంతో జీడిగడ్డతండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

నర్సంపేట: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బానోత్ సుక్యా కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాయపడిన కూలీలకు కార్పొరేట్ వైద్యంతోపాటు రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. గాయపడి ఆస్పత్రికి చేరుకున్న కూలీల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అదేవిధంగా ముగ్గురిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, సూపరింటెండెంట్‌తో పెద్ది ఫోన్‌లో మాట్లాడారు. నర్సంపేటలో గత బీఆర్ఎస్ సర్కారు మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిని నిర్మించినట్లు పెద్ది చెప్పారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. జీడిగడ్డతండా నుంచి వాహనంలో ప్రయాణిస్తున్న 37 మంది వ్యవసాయ కూలీలు గాయపడ్డారన్నారు. ఇంత పెద్ద ఘటన జరిగినప్పుడు క్షతగాత్రులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించలేకపోవడం కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శమన్నారు. జీడిగడ్డతండాలో గాయపడిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అవకాశం కల్పిస్తూ వెంటనే రూ. 12 వేలు చెల్లించేలా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నల్లా మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, క్లస్టర్ బాధ్యులు మండల శ్రీనివాస్, నాగి శెట్టి ప్రసాద్, బండి రమేశ్, దేవోజు సదానందం ఉన్నారు.

ఆస్పత్రిలో వైద్యం కరువు

చెన్నారావుపేట మండలం జీడిగడ్డతండాలో జరిగిన ఆటో ట్రాలీ బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను 108 వాహనాల్లో నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ క్షతగాత్రులకు వైద్యం కరువైంది. 37 మందికి పైగా కూలీలు గాయపడ్డారు. కొందరికి కాళ్లు, చేతులు విరిగాయి. మరికొందరి తలలు పలిగిపోయాయి. నర్సంపేట ఆస్పత్రి వైద్యులు వారిని ఎంజీఎం దవాఖానకు రెఫర్ చేశారు. గాయపడిన వారికి తూతూమంత్రంగా వైద్య సేవలు అందించిన డాక్టర్ల పనితీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నర్సంపేట: కూలీలను పరామర్శిస్తున్న పెద్ది

ఆటో బోల్తా.. ఒకరు మృతి

స్వామి(ఫైల్)

నర్సంపేట: కారును తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందాడు. మండలంలోని ముత్తోజిపేటకు చెందిన కాకి స్వామి (57), ఇదే గ్రామానికి చెందిన పోశాల పూలమ్మతో పాటు మరో ఇద్దరు ప్రయాణికులు ఆటోలో నర్సంపేటకు బయల్దేరారు. పట్టణ శివారు కమలాపురం క్రాస్‌రోడ్డు వద్ద యూటర్న్ తీసుకుంటున్న కారును తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. స్వామి, పూలమ్మకు తీవ్ర గాయాలు కాగా, పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి స్వామిని ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతరం పూలమ్మ వరంగల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించారు.

పేరిణి శిక్షణ కోసం ఆర్థిక సహకారం

పోచమ్మమైదాన్, మార్చి 6: వరంగల్ దేశాయిపేట రోడ్డులోని నటరాజ కళా కృష్ణ నృత్య జ్యోతి అకాడమీ నిర్వాహకుడు, ప్రముఖ పేరిణి నృత్య ఆచార్యులు గజ్జల రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో పేరిణి అధ్యాపక శిక్షణ కోసం వెళ్తున్న టీచర్లకు రూ. 1.50 లక్షల ఆర్థిక సహకారాన్ని అందజేశారు. నాగార్జున స్కూల్ అధినేత ఆడెపు వెంకటేశ్వర్లు చేతుల మీదుగా గురువారం 9 మంది పేరిణి కళాకారులకు పంపిణీ చేశారు. అలాగే, మొదటిసారిగా నిర్వహించనున్న పేరిణి నృత్య విశారద పరీక్షకు (2024-25) సంబంధించిన నోటిఫికేషన్ వివరాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవ అధ్యక్షుడు సీహెచ్.నరసింహారావు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి నర్సింగరావు, విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల అధ్యాపకురాలు చాతరాజు నవ్యజ, శిక్షణ పొందుతున్న టీచర్లు పల్నాటి శ్రీజ, బండారి వైష్ణవి, బండారి తేజస్విని, మర్కాల లోహిత్, తోడసం గురుదేవ్, టీ సంతోష్, రేగుల చందు, సాయి కపిల్, తేజ పాల్గొన్నారు.

శిక్షణ టీచర్లకు చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

రాములు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎర్రబెల్లి

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా : ఎర్రబెల్లి

రాయపర్తి, మార్చి 6: బాధిత కుటుంబాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అధైర్య పడొద్దని, తాను అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధైర్యం చెప్పారు. మండలంలోని బురహాన్‌పల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ముత్తారపు రాములు కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం పలు వివాహాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎర్రబెల్లి వెంట బీఆర్ఎస్ నాయకులు రంగు కుమార్, గొల్లపల్లి రమేశ్, ముంజాల రవీందర్, తాళ్లపల్లి రాజు, ఆలకుంట్ల వెంకన్న, బెల్లి పెద్దాపురం, ఉల్లెంగుల సుధాకర్, తోట నర్సింగం, చిట్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

షాపురంలో పనులు ప్రారంభిస్తున్న రేవూరి

'పేదల సొంతింటి కల నిజం చేస్తాం'

సంగెం/గీసుగొండ, మార్చి 6: పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలంలోని షాపురంలో గురువారం ఆయన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, మాజీ జడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ, నాయకులు హరిబాబు, మడత కేశవులు, పేరాల రాజు, నరహరి, దొనికెల శ్రీనివాస్, రమేశ్, జగన్నాథచారి పాల్గొన్నారు. అలాగే, గీసుగొండ మండలంలోని కొనాయిమాకులలో రేవూరి ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజలో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, నాయకుడు కొమురారెడ్డి, అధికారులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ ఆఫీస్ ఎస్‌పీ నాగరాజు

సమ సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలకం

నర్సంపేట, మార్చి 6: సమ సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని, విద్య, విజ్ఞానంతో సంపూర్ణ వికాసం సాధ్యమని డీజీపీ ఆఫీస్ ఎస్‌పీ నాగరాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సైకాలజిస్టుల సంఘం సహకారంతో 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలలపాటు నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ప్రేరణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని, శాస్త్రీయ ప్రణాళిక పునశ్చరణతో పరీక్షల్లో విజయం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ పరికిపండ్ల అశోక్, హెచ్ఎం కాంతారావు, ఉపాధ్యాయులు రాజేశ్, వాణి, శౌరి, సురేశ్, రాజమౌళి, నిర్మల పాల్గొన్నారు.

శాంతి సదస్సుకు రామా చంద్రమౌళి

పోచమ్మమైదాన్, మార్చి 6: అతి పురాతన సాహిత్య సాంస్కృతిక సంస్థ అయిన ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ ఇంటర్ కల్చరల్ స్టడీస్ అండ్ రీసర్చ్ (ఐఎస్ఐఎస్ఎఆర్) ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు కోల్‌కత్తా మహానగర్‌లో జరగనున్న అంతర్జాతీయ శాంతి సదస్సుకు ఓరుగల్లుకు చెందిన ప్రముఖ కవి రామా చంద్రమౌళిని ఆహ్వానించారు. ప్రస్తుత, ప్రస్తుత వర్తమాన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధిక సంఖ్యలో కవులు, రచయితలు మూడు రోజులపాటు నిర్వహించే 'ఆలోచనపరులు, రచయితల సదస్సులో ఆయన పాల్గొంటారు.

పోస్టుకార్డులు చూపుతున్న ఉద్యమకారులు

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

ఖానాపురం, మార్చి 6: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో గురువారం ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి కార్డులను పోస్టు చేశారు. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, రూ. 25 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీరమల్ల రాములు, కందికట్ల జయ, వల్లెపు శ్రీనివాస్, వంగ గణేశ్ పాల్గొన్నారు.

పంపు సెట్లకు మరమ్మతులు చేయాలి

ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న మేయర్

వరంగల్, మార్చి 6: ఫిల్టర్‌బెడ్‌లో పని చేయకుండా మూలన పడి ఉన్న మోటర్ పంపు సెట్లకు వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె కేయూసీ ఫిల్టర్‌బెడ్‌ను తనిఖీ చేశారు. వేసవిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగొద్దన్నారు. ఫిల్టర్‌బెడ్‌లోని పాత పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించి ప్రస్తుత పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఈఈ మహేందర్, మాధవీలత, సంతోష్‌బాబు, డీఈ రాజ్‌కుమార్, ఏఈ హరికుమార్ ఉన్నారు.

ఢిల్లీలో వెల్లివిరిసిన ఓరుగల్లు శోభ

కళాకారులను అభినందించిన కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, మార్చి 6: దేశ రాజధాని ఢిల్లీ గడ్డపై ఓరుగల్లు శోభ వెల్లివిరిసింది. వివిధ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ఇత్తడి, హస్తకళల గొప్పతనాన్ని జిల్లా కళాకారులు మరోసారి ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో ప్రదర్శించారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రారంభించిన కార్యక్రమంలో వరంగల్ రంశాయిపేట కళాకారులు తయారు చేసిన నగిషీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. నాబార్డ్ ప్రాజెక్ట్ కింద శిక్షణ పొందిన కళాకారుడు మట్టెవాడ ప్రణయ్‌కుమార్, ఎం సంతోష్ కుమార్ 25 మంది కళాకారులకు నాయకత్వం వహించారు. కలెక్టర్ సత్య శారద కళాకారుల బృందాన్ని అభినందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, **VISLAVATH VIJENDAR S/o. Sakru Nayak,** R/o. H.No. 2-3/9, Kasimdevipet Village, Mulugu Mandal, Mulugu Dist. My Daughter name Changed from **VISLAVATH PRANVITHA** to **VISLAVATH PRAKRUTHI** for all purposes.

WANTED
jobs Apply Now!
★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

కలెక్టరేట్‌లో అంతర్గత బదిలీలు

ఖిలావరంగల్, మార్చి 6: వరంగల్ కలెక్టరేట్‌లో ఇద్దరు ఉద్యోగులను డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ ఆర్డీవో ఏవోగా పని చేస్తున్న అబీద్ అలీని కలెక్టరేట్‌లోని సెక్షన్ బదిలీ చేశారు. అలాగే, సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న రమేశ్‌ను ఏవోగా బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

ఆలయంలో నాలుగోసారి దొంగతనం

కరీమాబాద్, మార్చి 6: వరంగల్ పెరుకవాడలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో నాలుగోసారి దొంగతనం జరిగింది. బుధవారం రాత్రి ఆలయాన్ని మూసివేసిన అర్చకులు ఇంటికి వెళ్లిపోయారు. గురువారం ఉదయం తిరిగి వచ్చి చూడగా, హుండీ పగులగొట్టి కనిపించింది. వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'11న యువ ఉత్సవంలో పాల్గొనాలి'

కరీమాబాద్, మార్చి 6: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 11న బొల్లికుంటలోని వాగ్దేవి కళాశాలలో నిర్వహించనున్న జిల్లాస్థాయి యువ ఉత్సవంలో యువత పాల్గొనాలని నెహ్రూ యువకేంద్రం వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేశ్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని యువతీ యువకులకు యంగ్ రైటర్స్, యంగ్ ఆర్టిస్ట్, ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక జానపద నృత్యం (గ్రూప్) సైన్స్ ఎగ్జిబిషన్ (గ్రూప్, వ్యక్తిగతం)లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పంచ ప్రాన్' అంశంపై పాల్గొనే వారు 7675824707, 9573393831 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైల్వే గూడ్స్ షెడ్‌లో వైద్య శిబిరం

ఖిలావరంగల్, మార్చి 6: వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్‌లో హమాలీ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గురువారం డీఏవో అనురాధ ప్రారంభించారు. హమాలీలతోపాటు వారి కుటుంబ సభ్యుల శ్రేయస్సు కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన కోరమండల్, ఎన్ఎస్ఆర్, అపోలో, ఎలైట్, కాకతీయ కంటి హాస్పిటల్ నిర్వాహకులను ఈ సందర్భంగా డీఏవో అభినందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నర్సంపేట, మార్చి 6: ముగ్దుంపురానికి చెందిన సీహెచ్ రాజశేఖర్ పది రోజుల క్రితం చనిపోయాడు. గురువారం మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ. 52,500 ఆర్థిక సాయం అందజేశారు. మెపా నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీసీడీవో

సంగెం, మార్చి 6: మండలకేంద్రంలోని కేజీబీవీని గురువారం డీసీడీవో ప్లారెన్స్ తనిఖీ చేశారు. వంట గదిలోని బియ్యం, కూరగాయలు, పప్పు దినుసులను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌తోపాటు రికార్డులను తనిఖీ చేశారు. ప్రత్యేకాధికారి నీలిమకు సూచనలు చేశారు.

చాంబర్ మాజీ అధ్యక్షుడి సభ్యత్వం రద్దు?

కాశీబుగ్గ, మార్చి 6: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ పూర్వ అధ్యక్షుడు దిడ్డి కుమారస్వామి సభ్యత్వాన్ని రద్దు చేయాలని పాలకవర్గం నిర్ణయించినట్లు తెలిసింది. చాంబర్ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పని చేస్తునందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

కళాకారుడికి జాతీయ పురస్కారం

పర్వతగిరి, మార్చి 6: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గజవెల్లి శ్రీరంగంను విశ్వశాంతి జాతీయ స్థాయి ఉగాది పురస్కారం వరించిందని స్థానికులు తెలిపారు. శ్రీరంగం 30 ఏళ్లుగా తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో రేడియో, టీవీ, రవీంద్రభారతిలో పలు ప్రదర్శనలిచ్చారు. శ్రీరంగం ప్రతిభను గుర్తించిన శ్రీఆర్యాని సకల కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ ఉగాది పురస్కారానికి ఎంపిక చేశారు. దీంతో ఈ నెల 5న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆయన అవార్డు అందుకున్నారు.

'సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి'

దుగ్గొండి, మార్చి 6: ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. మందపల్లిలోని బ్యాంక్ మిత్ర సెంటర్‌లో గురువారం ఆయన పాస్‌బుక్ ప్రింటర్‌ను ప్రారంభించి సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. మందపల్లి టీజీబీవీ మేనేజర్ మెహన్‌రాజ్, ఐరెక్స్ చానల్ మేనేజర్ నరసింహ, వీవో అధ్యక్షురాలు పద్మ, వీవోఏ మధురబాయి, మమత, అనురాధ, సౌందర్య పాల్గొన్నారు.

Office of the Executive Engineer, TGMSIDC Division, Warangal
H.No. 2-11-324/1. Beside Govt. CD&TB Hospital, Hanamkonda 506 009.
Phone No. 0870-2455769, Email Id: eetsmsidcwgl@gmail.com

Tender Notice No. 7/EE/TGMSIDC/WGL/2024-25/, Dated: 06-03-2025
Tender invited through e-procurement platform for the following works **"1)** Providing of Street Lights with Poles and Armoured Cable at Area Hospital Bhupalpally in Jayashankar Bhupalpally **2)** Repairs and Renovation to PHC Kaleshwaram at at Kaleshwaram in Jayshankar Bhupalapally District (Reserved for SC Category) **3)** Purchase and Install (04) body freezer boxes to Government General Hospital Bhupalpally. Two (02) for CHC Mahadevupr and Two (02) for Government Medical College, Jayashankar Bhupalpally **4)** Providing 03 No's new Refrigeration Units in place of irrepairable Air Conditioners for the old Central Medicine Stores at Hanamkonda District. The other details can be seen at website https://tender.telangana.gov.in.
Sd/- **EXECUTIVE ENGINEER, TGMSIDC DIVISION, Warangal.**

మాజీ మంత్రి ఎర్రబెల్లిని విమర్శించడం సిగ్గుచేటు

- కాంగ్రెస్ పాలనలో ఎండుతున్న పంటలు
- సాగు నీరు, కరెంట్‌పై దృష్టి పెట్టాలి
- మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

వర్ధన్నపేట, మార్చి 6: వార్డు మెంబర్లుగా గెలవని వారు కూడా ప్రజా సంక్షేమం కోసం 40 ఏళ్లుగా పని చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావును విమర్శించడం సిగ్గుచేటని మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి ఎద్దేవా చేశారు. మండలకేంద్రంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచిన ఎర్రబెల్లిని వార్డు మెంబర్‌గా గెలవలేని నాయకుడు విమర్శించడం తగదని, మీ స్థాయి ఏంటో తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. దయాకర్‌రావు వర్ధన్నపేట ఎమ్మెల్యే